రమాయణం

# చెట్టులెక్క గలవా?!

## 1

**ట్రెక్కింగులూ, మౌంటెనీరింగులూ అనేవి ఉంటాయని కూడా తెలియని బాల్యంలో.. చెట్లూ గుట్టలూ ఎక్కడం నాకు చాలా ఇష్టంగా ఉండేది. మా ఇంటి వెనుక పెద్ద పెరడూ, అందులో రకరకాల చెట్లూ ఉండేవి. వాటిలో జామచెట్లు నాకు అత్యంత ప్రియమైనవి. ఏడాది పొడవునా కాయలు కాసేవి.**

నేను బడి వేళల్లో తప్ప.. ఇంట్లో లేనంటే, చెట్టు మీద ఉన్నానన్నమాటే. ఆ చెట్లు నన్ను అనేక రకాలుగా ఆదుకునేవి. స్కూల్ నుంచి ఇంటికి రాగానే బ్యాగ్ ఇంట్లో వేసి.. గబగబా జామ చెట్టు ఎక్కేదాన్ని. గుత్తులు గుత్తులుగా కాయలుండేవి. ఏది తెంపాలో తెలిసేది కాదు. చిలకలు కొట్టిన కాయలు వదిలేసి.. దోరమగ్గిన కాయలు తెంపుకొని తినేదాన్ని. కిందికి ఎవరొస్తే వాళ్లకు కాయలు తెంపి విసిరేసేదాన్ని.


మా ఇంటి పక్క పురోహితుల కుటుంబంలో కాశయ్యగారు నాకు స్కూల్లో జూనియర్. వయసులో నా కంటే పెద్ద అయినా.. జూనియర్ కనుక 'గారు! మీరు!' అని ఎందుకు అనాలనేది నా వాదన. అమ్మేమో.. వాళ్లు అయ్యవార్లు కనుక వాళ్లింట్లో ఏడాది పిల్లల్నయినా సరే.. 'మీరు' అనాలని ఆర్డర్. ఇతడు తెలివైనవాడే గానీ లెక్కలు, ఇంగ్లిష్.. రెండు సబ్జెక్టుల్లో డౌట్లుంటే నా దగ్గరికి పరిగెత్తుకొని వచ్చేవాడు. నేను బేతాళుడిలా (బేతాళురాలిగా అనాలేమో!) చెట్టు మీద ఉన్నది గమనించి.. కిందినుంచి నోట్‌బుక్ పెన్నుతో సహా సిద్ధంగా ఉండి, లెక్క చెప్పమని అరిచేవాడు. అతిథి మర్యాదలు చూడాలిగా ముందు! అందుకే, నేను ఓ జామకాయ విసిరి.. అది తింటూ లెక్క చదవమని పైనుంచి స్టెప్ బై స్టెప్ ఆన్సర్ చెప్పేదాన్ని. అతను రాసుకొని వెళ్లేవాడు. ఇంగ్లిష్ గ్రామర్‌కు అయితే.. నాతో గోళీలాడాకే చెబుతాననీ, చిర్రగోనీ ఆడితేనే ఎక్స్‌ప్లెయిన్ చేస్తాననీ సతాయించేదాన్ని. ''ప్లీజండీ.. ప్లీజండీ!'' అనేవాడు పాపం. ''అబ్బ! చెప్ప రాదే.. గా పిల్లగాణ్ని ఎందుకు సతాయిస్తవు?'' అని అమ్మో, నాన్నో అతణ్ని వెనకేసుకొచ్చేవారు.

అంతేకాదు.. చిన్నచిన్న ప్రమాదాల నుంచి కూడా ఈ చెట్లే నన్ను కాపాడేవి. నాకు అతి పెద్దకష్టం.. తలంటు పోసుకోవడం! ఆ జుట్టు ఆరాక నూనె రాసి చిక్కులు తీసి దువ్వడం! రీటా యాడ్ మాదిరి చాలా పెద్ద జుట్టు ఉండేది నాకు. నేనొక స్టూల్ మీద కూర్చుంటే.. కింద జీరాడేదన్నమాట. పైగా చాలా ఒత్తుగా ఉండి.. తొందరగా మురికి వదిలేది కాదు. పండుగ రోజుల్లోనో, సెలవునాడో.. నానమ్మ నా తలంటు కోసం కుంకుడు కాయలు కొడుతుండగానే.. నా మనసు ప్రమాదాన్ని శంకించేది. వెంటనే జామ చెట్టెక్కి కూర్చునేదాన్ని. ఆమె నన్ను పిలిచీ పిలిచీ.. ''ఇగ దిగవే అమ్మా! రావే.. తలకు పొయ్యను తియ్యి!'' అని హామీ ఇచ్చేదాకా.. చెట్టు దిగేదాన్ని కాదు. కానీ, ఏదో ఓ రోజు తప్పదుగా! ఎంతగా టవల్ కళ్లకు అడ్డుపెట్టుకున్నా.. ఆ భయం లేని కుంకుడు రసం కళ్లల్లోకి పోయి విపరీతంగా మంట పెట్టేది. నేను కెవ్వుకెవ్వు మంటూ ఆమెను తిప్పలు పెడుతూంటే.. విసుగు పుట్టి రెండు దెబ్బలు వేసేది. దాంతో నేను ట్రాజెడీ సన్నివేశంలో మహానటి సావిత్రిలా కన్నీళ్లను కళ్లల్లోనే ఆపి కిక్కురుమనకుండా భరించేదాన్ని.

ఆ తరువాత నానమ్మ కొట్టిందని అమ్మకు కంప్లయింట్ చేసేదాన్ని. ''బాగ కొట్టింది. గంత ప్రళయం చేస్తె ఏం జేస్తది? నేనైతె ఇంక రెండు ఏద్దును!'' అనేది అమ్మ. దాంతో ఆ ఛానెల్ క్లోజ్ అయిపోయేది. ఆరిన జుట్టుకు నూనె రాసి అమ్మ దువ్వుతుంటే.. ఆ చిక్కులకు ఇంకా నొప్పి పుట్టినా కిమ్మనకుండా భరించేదాన్ని. సినిమాల్లో హీరోయిన్లు.. 'లేవా దేవా.. రావా!' అని పాడుతున్నప్పుడు, అలా జుట్టు విరబోసుకుని ఎందు కుంటారో అర్థం అయ్యేది. ఈ తలకు కొబ్బరినూనెలు రాయడం, చిక్కులు తీసి దువ్వడం, జడలు వేయడం.. ఇదంతా దండగ! దీనికే రెండు గంటలు పట్టేట్టయితే మిగతా పనులు ఎప్పుడు చేసుకుంటారు?!

మరో దరిద్రం ఏమిటంటే.. ఇంత శుభ్రంగా ఉన్నా, ఎవరో పిలిచినట్టు నా తలనిండా పేలు వచ్చి చేరేవి. అదొక బాధ! జుట్టు దువ్వేటప్పుడు అమ్మ ఒక ఇనుప జల్లిగంటె నిండా నిప్పులు తెచ్చి పక్కన పెట్టుకునేది. అమ్మ నా నెత్తి దువ్వుతూ.. వచ్చిన పేలన్నిటినీ ఆ నిప్పుల్లో వేసేది. అలా ఎన్నో హత్యలు జరిగేవి. ఇక నెలకోసారి మా ఇంట్లో పనిచేసే సంకెండ్ల లచ్చమ్మ వచ్చి.. తన ఆయుధమైన ఈరిపెనతో జుట్టు కుదుళ్ల నుంచీ దువ్వి, చిన్న గుడ్లను చంపేసేది. ఆ బాధకన్నా బోడిగుండు చేయించుకుంటే బాగుండునని అనిపించేది నాకు. అసలు ఇంతింత జుట్టు పెంచుకునే బాధ ఆడవాళ్లకే ఎందుకో!? అనుకునేదాన్ని. ఎవరైనా బట్ట తల వాళ్లు కనిపిస్తే.. 'ఎంత అదృష్టవంతులో!?' అన్నట్టు వాళ్ల వంక చూసేదాన్ని.

ఒకరోజు నానమ్మే.. ''ఈ అవస్థ కంటె కొన్నాళ్లు బళ్లె ఏరే కూచోరాదే!'' అని చాలా డామేజింగ్ సలహా ఇచ్చింది. ఎవరినుంచి ఈ రహస్య శత్రువులు వస్తున్నాయో ఎలా తెలుసుకోవడం?! అనుమానితులనందర్నీ అరెస్ట్ చేసినట్టు.. ఇంకా నయం! నా ఫ్రెండ్స్ రాధా, శ్యామలా, రుక్మిణీ, రేవతీ.. వీళ్లందర్నీ వదిలి, వెనుక బెంచీలో అంటువ్యాధి వచ్చినదానిలా వేరే కూచోవాలా? కుదరదు గాక కుదరదు! అనుకున్నాను. అంతకు రెండేళ్ల ముందే నాకు ఓసారి గుండు కొట్టించి, నా జుట్టుతో రెండు పెద్ద సవరాలు చేయించి.. మా అమ్మ ఒకటీ, అత్తయ్య ఒకటీ తీసుకున్న అనుభవం వారి సొంతం అయింది. మొత్తానికి ఇంటర్ అయిపోయి.. నా జుట్టు నా చేతికి వచ్చి, సగానికి సగం తగ్గిపోయాక గానీ.. ఈ పేలు నన్ను వదల్లేదు. ఇంతకూ చెట్లతో మొదలై.. ఎటో వెళ్లిపోయాను. ఆ విషయాలు వచ్చేవారం మాట్లాడుకుందాం. పూర్తి చేయాల్సిన పనులు చాలా ఉన్నాయ్. ■





**నెల్లుట్ల రమాదేవి**
**రచయిత్రి**